కీర్తన ఆలీవ్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతికి చెందిన అరవ కీర్తన ఆలీవ్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగష్టిన్ ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 1న నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో దాదాపు 18 దేశాల నుండి 1500 మంది విద్యార్థులు పాల్గొని, ఒక గంట పాటు కీబోర్డ్ ప్లే చేశారు. అందులో తిరుపతి జిల్లా ఎల్బీనగర్‌కు చెందిన విజయబాబు, శైలజ దంపతులకు కుమార్తె, 6వ తరగతి చదువు తున్న అరవ కీర్తన ఆలివ్ గంటకు పైగా కీబోర్డ్ వాయించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన అరవ కీర్తన ఆలైవ్‌కు సంబంధించిన ధ్రువీకరణ పత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

బాతుల వ్యాపారి ధన దాహానికి గిరిజన బాలుడు మృతి

బాలుడి వెంకటేష్ మృతి కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - సత్యవేడు: బాతుల వ్యాపారి ధన దాహానికి 9 ఏళ్ల గిరిజన బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గూడూరు ప్రాంతానికి చెందిన గిరిజన బాలుడు వెంకటేష్ మిస్సింగ్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. అనారోగ్యానికి గురై మృతి చెందిన తొమ్మిది ఏళ్ల బాలుడు వెంకటేష్‌ను తన తల్లికి చెప్పకుండా సత్యవేడుకు చెందిన బాతుల ముత్తు పాతిపెట్టాడు. ముత్తు దగ్గర అప్పు చేసి తిరిగి చెల్లించలేక బాలుడి తల్లిమ అంకమ్మ తన చిన్న కుమారుడు వెంకటేష్‌ను ముత్తు దగ్గర వదిలి వెళ్ళింది. కొన్ని రోజులుగా తన కొడుకు ఫోన్లో మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చి తన కొడుకేడని బాతుల యజమాని ముత్తును ప్రశ్నించి నిలదీసింది. వెంకటేష్ కనిపించడం లేదంటూ ముత్తు మాటలు దాటేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణలో తన కొడుకు మరణించాడనే వార్త విషాదాన్ని మిగిల్చింది. గూడూరు మండలం, నెలటూరు పంచాయతీ, చవటపాలెం గిరిజన కాలానికి చెందిన అంకమ్మ కుమారుడు వెంకటేష్ మృతికి సంబంధించిన కేసులో స్థానిక పోలీసు అధికారులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. గురువారం స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో పుత్తూరు డిఎస్పి రవికుమార్ ఆధ్వర్యంలో సిఐ మురళినాయుడు పర్యవేక్షణలో ముగ్గురు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు.

నిందితుల అరెస్ట్ చూపుతున్న సత్యవేడు పోలీసులు

బాలుడు వెంకటేష్ (ఫైల్ ఫోటో)

డి.ఎస్.పి రవికుమార్ తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాలుడు వెంకటేష్ మృతికి సంబంధించి సత్యవేడు మండలం నరసరాజ అగ్రహారం చెందిన ముత్తు(60), ధనభాగ్యం (55), రాజశేఖర్(32) ముగ్గురిని అరెస్టు చేశారు. చవటపాలెంకు చెందిన చెంచయ్య భార్య అంకమ్మకు చెంచు కృష్ణయ్య, రామలక్ష్మమ్మ, వెంకటేష్ ముగ్గురు పిల్లలు ఉన్నారు. 3 నెలల క్రితం నెల్లూరు జిల్లా, దుత్తలూరు మండలం, తుర్కుపల్లిలో శివరాంరెడ్డి వద్ద పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందుకుగాను 10000 రూపాయలు అంకమ్మకు చెల్లించడంతోపాటు ఆమె ప్రకాష్‌తో సహజీవనం కొనసాగిస్తోంది. ఇదే సమయంలో అంకమ్మ తల్లిదండ్రులు సత్యవేడులో బర్రెలు కాపలాదారులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బర్రెలు మేపుకుంటూ ధనభాగ్యం పరిచయమైంది. తమ ఇంట్లో బర్రెలు మేపేందుకు ఎవరైనా ఉంటే చెప్పండి అంటూ అంకమ్మ తల్లిదండ్రులకు చెప్పారు. ఈ క్రమంలోనే తన కూతురు అంకమ్మ ఉందంటూ చెప్పడంతో వెంటనే 10000 వేతనం ఇవ్వడానికి ముత్తు అంగీకరించారు. 15000 అడ్వాన్స్ కూడా ఇచ్చాడు. అలా ఏడాది పాటు పనిచేస్తుండగా అంకమ్మ భర్త చెంచయ్య చనిపోవడంతో అంకమ్మ ఇక్కడి నుంచి సొంత ఊరికి వెళ్ళింది. ఆ క్రమంలో కొంత అప్పు చేయడంతో అప్పు కట్టి తీరాలని నిలదీయడంతో బాతుల వ్యాపారి ముత్తు 25 వేల అప్పు కట్టి మరల అంకమ్మను పనిలో పెట్టుకున్నాడు. పని భారం పెరగడంతో అంకమ్మ జీతం పెంచాలని కోరింది. కానీ అతను సుముఖంగా లేడు. దాంతో వారు పనిచేయలేమని చెప్పగా 42,000 వేల రూపాయలు కట్టి వెళ్లాల్సిందిగా నిలదీశాడు. అప్పు తిరిగిచ్చేవరకు అంకమ్మ చిన్న కొడుకును వదిలి వెళ్లాలని నిర్బంధించాడు. దిక్కుతోచని స్థితిలో తన చిన్న కొడుకును ముత్తూ దగ్గరే విడిచి వెళ్ళింది. కానీ అంకమ్మ తరచూ కుమారుడు వెంకటేష్‌తో ఫోన్లో మాట్లాడుతుండేది. ఈ క్రమంలోనే బాతులను మేపడానికి బాలుడుని తీసుకొని కంచి వద్దకు వెళ్లారు. అక్కడే కొంతకాలం మకాం వేశారు. అయితే కుమారుడు వెంకటేష్‌తో మాట్లాడడానికి తల్లి అంకమ్మ ప్రయత్నించడంతో కుమారుడు కనిపించడం లేదని చెప్పాడు. దీంతో ఆందోళన చెందిన అంకమ్మ సత్యవేడుకు చేరుకుని ముత్తును నిలదీసింది. అయితే సమాచారం అందకపోవడంతో మే 19న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పుత్తూరు డిఎస్పి రవికుమార్ ఆధ్వర్యంలో విచారణ చేయడంతో గుట్టు రట్టయింది. కంచిలో ఉన్న బాలుడు వెంకటేష్ అస్వస్థకు గురి కావడంతో ఏప్రిల్ 11వ తేదీనవ తేదీన కంచికి సమీపంలో లింగ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అయితే కోలుకోకపోవడంతో బాలుడు ఏప్రిల్ 12న మృతి చెందాడు. దీంతో కేసవుతుందని గ్రహించి, ముత్తు గుట్టు చప్పుడు కాకుండా కంచి వద్ద పాలేరు నదిలో బాలుడి దేహాన్ని పూడ్చి పెట్టేశారు. అయితే విచారణలో అసలు నిజాన్ని బయట పెట్టాడు. దీంతో పోలీసులు కంచికి చేరుకొని అక్కడ అధికారుల సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీయడంతో పాటు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్ట్ అనంతరం ఇది అనారోగ్య మృతా లేదా హత్యా అన్న నిజం తేలనుంది. ముగ్గురు నిద్దుతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మురళి నాయుడు చెప్పారు. బాలుడి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తిరుపతి జిల్లా సిపిఎం పార్టీ కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సత్యవేడు మండల ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్‌లు డిమాండ్ చేశారు. దాసరి జనార్ధన్ మాట్లాడుతూ బాతుల వ్యాపారి అయిన ముత్తు కనీసం మానవతా దృక్పథం లేకుండా బాల కార్మిక నిరోధక చట్టానికి విరుద్ధంగా నిర్బంధించి వెట్టి చాకిరి చేయడం దారుణమన్నారు. చనిపోయిన బాలుని చివరి చూపును కూడా కన్నతల్లికి చూపించకుండా పాతి పెట్టడం మన్నించరాని నేరమన్నారు. గిరిజనులకు నిర్బంధ విద్య అందించడంలో, బాలల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని, నెల్లటూరు గిరిజన కాలనికి చెందిన బాలుడు వెంకటేష్‌ను సత్యవేడు, దళవాయి అగ్రహారానికి చెందిన బాతుల వ్యాపారి ముత్తు, పనిలో పెట్టుకున్నాడు. ఆ బాలుడె ఏప్రిల్ 12 వ తేదీన తమిళనాడు రాష్ట్రం, కంచి పట్టణంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, తల్లిదండ్రులకు తెలియకుండా బాలుడి దేహాన్ని పూడ్చి పెట్టారు. దీంతో సత్యవేడు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఇతోధిక సహాయంగా బాధిత కుటుంబానికి 30 వేల రూపాయలు, మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు ఇవ్వాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు ఆరవ పార్వతయ్య, ఏసుపాక పెంచలయ్య, దాసరి వెంకటేశ్వర్లు వినతి పత్రం అందచేశారు.

పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

భూపాల్ హౌసింగ్ కాలనీవాసులతో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధి, భూపాల్ హౌసింగ్ కాలనీలోని పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 50 వార్డులోని భూపాల్ హౌసింగ్ కాలనీ, తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను గురువారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేయాల్సిన పనుల గురించి ప్రజలు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భూపాల్ హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేయాలని అన్నారు. ప్రధాన రహదారి పక్కన వెళుతున్న మురుగునీటి కాలువ నీరు రోడ్డుపైకి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మూర్తి , డి.ఈ వెంకటప్రసాద్, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

లింగంపాడులో పిఎండిఎస్ సాగు చేసిన పొలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలం, లింగంపాడులో పిఎండిఎస్ సాగు చేసిన పొలాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ గురువారం సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రకృతి వ్యవసాయం రైతులు లాభదాయకమని సూచించారు. ఈ పియండిఎస్ పైరు 11 రకాల విత్తనాల్ని గోవర్ధన్ అనే రైతు పోలంలో వేయడం జరిగింది. వీటి వల్ల ఉపయోగాలని గ్రామ రైతులకు ఏపీసీ ఎన్ఎఫ్ డిపిఎం శ్రీ షణ్ముగం, ఏడిఏ అగ్రి కల్చర్ అనిత కలెక్టర్ వివరించారు. వీటిని వేసుకొని భూమి సారవంతం అవుతుందని, తేమశాతం ఎక్కువ సమయం నిలుపుకుంటుందని తద్వారా ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని గ్రామంలోని రైతులందరికీ కూడా వివరించారు. ఈ సందర్భంగా తిరు పతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పియండిఎస్ కిట్స్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 25 వేల ఎకరాలలో ఈ సంవత్సరం వేయించే విధంగా ప్రణాళిక సిద్ధపరచామని తెలిపారు. తల్లంపాడులో గోవర్ధన్ వేసిన 2 రకాల మినుము పంటను కూడా సందర్శించారు. వ్యవసాయ శాఖ, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది ద్వారా పిఎండిఎస్ కిట్స్ రైతులుకి అందించి, వారి పొలాల్లో వేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రైతులు పండించే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు పండించే ధాన్యం పంటను డ్రై కోసం మండల స్థాయిలో యంత్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కలెక్టర్‌ని కోరారు. స్థానికంగా డ్రై యంత్రాలు లేక పోవడం వల్ల రైతులు దళారుల చేతిలో మోసపోవడం తప్పడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నెర్రి కాలువ నుంచి లింగం పాడు చెరువులోకి సాగునీరుని అందించే సప్లై ఛానల్ లాకులు దెబ్బ తినడం వల్ల కాలువ పూడిపోవడంతో చెరువులోకి సాగునీరు రావటం లేదని రైతులు తెలియ జేశారు. కలెక్టర్ స్పందించి నెర్రి కాలువకు పూడిక తీసి చెరువులోకి సాగునీరు సాఫీగా పోయే విధంగా పనులు చేపించేందుకు ఎఫ్.డి.ఆర్ క్రింద నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. కాలువ పోరం బోకు భూమి ఆక్రమణకు గురై ఉంటే, వారిపై చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎం ఎఫ్ సిబ్బంది, దొరవారిసత్రం మండల వ్యవసాయ అధికారి జ్యోతిర్మయి, ఎంపీడీవో గోవర్ధన్, ఆర్ఐ ప్రవీణ్ రాయల్, మండల గ్రామస్థాయి అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

24న ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ అప్ గ్రేడెడ్ జూనియర్ గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 24వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ దామోదర నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ప్రకారం ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు మెస్సేజ్ వస్తుందని పేర్కొన్నారు. వివరాలకు 9440204745, 9703220780 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు 'డయల్ యువర్ ఈవో'

ప్రజాశక్తి -తిరుమల: టిటిడి నిర్వహించే 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమం శనివారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో జె.శ్యామలరావుకు ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

తుడాను ఏనాడూ హోదాగా చూడలేదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థను ఏనాడు తమ కుటుంబ సభ్యులు హోదాగా చూడలేదని, కానీ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తుడాలో ఏదో జరిగిపోయింది, విజిలెన్స్ విచారణ జరిపి నిజాలు నిగ్గు తేలుచుతామని చెబుతున్నారని, వాస్తవానికి విచారణ మొదట కోరింది తామేనని వైసిపి చంద్రగిరి నియోజకవర్గ కన్వీనర్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమాఎేశంలో ఆయన మాట్లాడారు. 2006 నుండి 2010 వరకు తుడా చైర్మన్‌గా ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. 2019 నుండి 24 వరకు తుడా ఆదాయాన్ని పరిశీలిస్తే 2024-25 వార్షిక బడ్జెట్ ప్రకారం రూ.439 కోట్లు చేరిందని తెలిపారు. తుడాను 41 మండలాలు, 9 నియోజకవర్గాలకు విస్తరింపజేశామన్నారు. ఒక వైపు తుడాను అభివృద్ధి చేస్తూ మరోవైపు తుడా నిధుల ద్వారా చంద్రగిరి నియోజక వర్గం లోని ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 నుంచి రూ.15 కోట్ల రూపాయలు వెచ్చించి అభి. వృద్ధి కార్యక్రమాలను చేసామన్నారు. తుడా నిధులతో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బెంచీలపై కూడా విమర్శలు చేస్తున్నారన్నారు. ఎక్కడ అవినీతి జరిగిందో తుడాపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కూటమి నేతలకు మోహిత్ రెడ్డి సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో రేణిగుంట రోడ్డులోని తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్ర మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడదల మాధవరెడ్డి, వైసిపి రూరల్ మండల అధ్యక్షులు మునీ శ్వర రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు చిన్ని యాదవ్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సెల్వం, కార్యదర్శి మల్లారపు వాసు, రణధీరపురం గ్రామపంచాయతీ ఉపసర్పంచి మల్లెమొగ్గల ఉమాపతి పాల్గొన్నారు.

ఘనంగా బొజ్జల జన్మదిన వేడుకలు

కుటుంబ సమేతంగా ముక్కంటి ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున కేక్‌లు కటింగ్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బొజ్జల నివాసంలో అశేషంగా తరలి వచ్చిన అభిమానుల సమక్షంలో సుధీర్ రెడ్డి భారీ కేక్ కట్ చేశారు. పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సమేతంగా బొజ్జల ముక్కంటీశుని దర్శించుకున్నారు. బొజ్జలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో గాలి చలపతి నాయుడు, విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, మునిరాజా నాయుడు, డాక్టర్ ఉమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని 32వ వార్డులో ఆ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ, అధ్యక్షులు బి.రుకేష్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా అన్నదానం చేయడం ఆనందంగా ఉందని షఫీ అన్నారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షులు విజయ్ కుమార్, కంఠా రమేష్, షాకీర్ ఆలీ, కాలప్ప రెడ్డి, నాగరాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని ఏర్పేడు, పాపా నాయుడుపేట గ్రామాలలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదిన సందర్భంగా పలువురు మండల నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గుడిమల్లం ఆలయంలో ఆలయ మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు భక్తులకు ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఏర్పేడులో రెడ్డివారి గురువారెడ్డి, శివ శంకర్ రెడ్డి, పేరం ధనంజయ నాయుడు, నాగరాజు నాయుడు, నైనారు పున్నారావు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత విద్యార్థి జేమ్స్ కేసును

నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దళిత విద్యార్థి జేమ్స్‌ను దారుణంగా కొట్టి హింసించి హత్యాయత్నానికి పాల్పడిన వారిని కాపాడేందుకు పోలీసులు ప్రయత్నిస్తూ కేసును నీరుగార్చే కుట్రకు తెరలేపారని అఖిలపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో అఖిలపక్ష నాయకులు మాట్లాడారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ దళిత విద్యార్థిని హింసించిన వారిపై మొదట్లో నామమాత్రపు కేసుగా నమోదు చేసిన పోలీసులు అటు తర్వాత అట్రాసిటీ కేసుగా మార్చారని అయితే, హత్యాయత్నానికి సంబంధించిన సెక్షన్ పెట్టకుండా బాధితుడు ముందు ప్రతిపాదనలు ఉంచి నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆర్ పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ తిరుపతిలో విద్య కోసం వచ్చే వేలాదిమంది విద్యార్థుల రక్షణకు పోలీసులతో పాటు జిల్లా ఉన్నతాధికారులు కూడా సమగ్రమైన కఠిన చర్యలు తీసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దళిత విద్యార్థి జేమ్స్‌కు రక్షణ కల్పించి, అతని ఆరోగ్యం బాగు అయ్యేంతవరకు తగిన ఖర్చులకు డబ్బులను ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులను ఖండించిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతు పలికి అధికారంలోకి తీసుకొచ్చారని, నేడు అదే కూటమి ప్రభుత్వం దళితులపై పాసవిక దాడులు జరుగుతున్న నోరు మెదిపి మాట్లాడలేకపోవడం దారుణమన్నారు. పూర్తిస్థాయి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి ఈనెల 29న తిరుపతిలో నిరసన ధర్నా కార్యక్రమాన్ని, సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలానే దాడి చేసిన విద్యార్థులు సమాజానికి ప్రమాదకరమని గుర్తించి ఆ కళాశాల యాజమాన్యం వారిని కళాశాల నుండి పంపేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే కళాశాల ముందు ధర్నా చేస్తామని సిపిఐ కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య హెచ్చరించారు. నిజంగా నిర్ధారణ కమిటీని కూడా ఈ విషయమై ఏర్పాటు చేసామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నీరుగట్టు నగేష్, వెంకటేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మేడికొండ ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి సిపిఎల్ సీజన్ వన్ ప్రారంభం

- తిరుపతిలో ఐపీఎల్ తరహాలో సిపిఎల్
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 6 కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారం : సిడిసిఏ అధ్యక్షులు విజయ్ కుమార్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతిలో ఐపిఎల్ తరహాలో చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సిపిఎల్-1)నిర్వహించనున్నారు. ఐదు జట్లతో ప్రారంభం కానున్న ఈ టోర్నీలో రంజి ట్రోఫీ, స్టేట్ టోర్నీ, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోనున్నారు. ఐపీఎల్‌కు ఏమాత్రం తీసిపోకుండా మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ఇప్పటివరకు ఎప్పుడూ లేని విధంగా 6 కెమెరాస్‌తో ప్రత్యక్ష ప్రసారం ఇవ్వనున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ టోర్నీని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఏసిఏ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి టాలెంట్ ఉన్నప్పటికీ అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్న క్రికెట్ క్రీడాకారులకు జాతీయస్థాయిలో రాణించగలిగే అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి కృషి చేస్తున్నదన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో ఇప్పటివరకు ఎక్కడ నిర్వహించని విధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సిపిఎల్ సీజన్-1 నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ట్యాలెంట్ ఉండి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్న క్రీడాకారులకు ఇది గొప్ప వేదిక కానున్నట్లు తెలిపారు. ఈ సీపీఎల్ ఐదు టీములతో 13 మ్యాచులు, ఏడు రోజులు పాటు ప్రతి ఒక్క టీం అన్ని టీం లతో ఆడునున్నాయన్నారు. టేబుల్ టాప్ నిలిచిన టీంలు ఫైనల్‌లో పోటీపన్నున్నట్లు తెలియజేశారు. ఈ టోర్నీలో గెలుపొందిన విన్నర్స్‌కు రూ.2 లక్షలు, రన్నర్స్ కు రూ.1 లక్ష, మూడవ స్థానంకు 50,000 వేలు అందజేయనున్నామని, అదేవిధంగా ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఓవరాల్ టోర్నీకి మ్యాన్ ఆఫ్ ది సీరియస్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్మెన్, బెస్ట్ ఫీల్డర్లకు అవార్డులతోపాటు నగదు బహుమతులు కూడా అందజేయనున్నట్లు ఆయన తెలియజేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎక్కడ జరగని విధంగా నిర్వహిస్తున్నామని, ఈ సీపీఎల్ మ్యాచులు ఐపీఎల్‌ను తలపించనున్నాయి అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. ఈ మ్యాచ్లు ప్రత్యక్ష ప్రసారం ఉండటం వలన క్రికెట్ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకుని ఏసిఏ, ఐపిఎల్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. రాబోవు రోజుల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి భారతీయ క్రికెట్ జట్టులో మన క్రీడాకారులు ఆడాలన్నదే ఆశయంగా ముందుకు వెళుతున్నామని క్రికెట్ విజయ్ పేర్కొన్నారు.

ఎర్ర మట్టి గుట్టలను కాపాడండి

తిరు పతి ఆర్‌డిఓకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: చంద్రగిరి, రామచంద్రాపురం మండలంలో గుట్టను చదును చేసి ఎర్రమట్టి అమ్ముకుంటున్న దొంగలను, గుట్టను కబ్జా చేస్తున్న వారిపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి ఆర్‌డిఓకు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర తిరుపతి రూరల్ కార్యదర్శి కే.సుమన్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఉండే పంచాయితీ ఆఫీసు అధికార వర్గానికి కూతవేటు దూరంలో ఉండే చంద్రగిరి ప్రభుత్వ బాయ్ హాస్టల్ దగ్గర 1479 సర్వే నెంబర్‌లో మట్టిని తవ్వి వందల ట్రిప్పులు తీసుకెళ్తున్నారన్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అదే విధంగా రామ చంద్రాపురం మండలం రోడ్డు, రామాపురం నుండి పచికాపురం రోడ్డు వరకు కొండలన్నీ మాయమైపోయని, ఎర్రమట్టి అమ్ముకుంటున్నా సంబంధిత తహశీల్దార్లు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నరని తెలిపారు. ఒక్కొక్క ఎర్ర మట్టిట్రిప్పు 30 వేల రూపాయలకు అమ్ముకుంటున్నారన్నారు. తక్షణమే ఎర్రమట్టి దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు.

సిఐటియు నగర కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా టి.సుబ్రహ్మణ్యం, ఎన్.మాధవ్ కృష్ణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సిఐటియు తిరుపతి నగర కమిటీ సమావేశం గురువారం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కోశాధికారి కెఎన్‌ఎన్ ప్రసాదరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 9వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న సమ్మెలో యావత్ కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం కోసం అన్ని యూనియన్ల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించాలన్నారు. సమ్మె నోటీసులు ఇవ్వాలని అన్ని యూనియన్లకు పిలుపునిచ్చారు. నగర అధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం, నగర ప్రధాన కార్యదర్శిగా మాధవ కృష్ణలను సమావేశంలో హాజరైనటువంటి కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే. వేణుగోపాల్, బుజ్జి, చిన్న, తంజావూరు మురళి, ఆనంద్, రఘు, వాసు, శేషయ్య, బాదుల్లా, రమేష్, శ్రీరాములు, కిరణ్, బాబు తదితర సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి.. సమ్మె నోటీసు

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్: వెంకటగిరి మున్సిపాలిటీలో మున్సిపల్ కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం ఉదయం వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌కి, మండల తాసిల్దార్‌కి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. 6వ తేదీలోపల పరిష్కరించకుంటే 7వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రవి, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం వెంకటగిరి అధ్యక్షుడు ఎన్.మురుగన్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయకులు సుబ్బయ్య, ప్రసాద్, పెంచలయ్య, గోపాల్, రమణయ్య, హరిబాబు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వైసిపి సర్పంచులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండల పరిధిలోని తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్, టీడీపీ కార్యాలయంలో చిగురువాడ, కె.సి పేట, పద్మావతిపురం సర్పంచ్‌లు తన అనుచరవర్గంతో ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో వైసీపీ నుండి టిడిపిలో చేరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో సీఎం చంద్రబాబు సుపరిపాలన, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేసిన అభివృద్ధిని చూసి టిడిపి పార్టీలో చేరామన్న వైసిపి సర్పంచులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, సర్పంచులు, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్టు తీయండి

మందు బాబులకోసం వేసిన చలువ పందిరి

ప్రజాశక్తి - పెళ్లకూరు: తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం గ్రామీణ ప్రాంతాలలో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సుమారు 110 బెల్ట్ షాపులు పైగా ఉన్నాయి. ఈ షాపులోల మందుబాబులకు 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోంది. ఎమ్మార్పీపై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న తీరు గ్రామస్తులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎండలకు మందుబాబులకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు వేసి మరీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. మందు బాబుల ఆగడాలు, కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో పలుమార్లు అధికారులకు బెల్టు షాపులపై ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు దృష్టి సారించి బెల్టు షాపులను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నారాయణ విద్యార్థి సైనిక్ స్కూల్‌కు ఎంపిక

సోహిని కుంచనపల్లి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ 2025-26 విద్యా సంవత్స రానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తిరుపతికి చెందిన నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని సోహిని 250 మార్కులు సాధించి ఎంపికైందని విద్యాసంస్థల డిజిఎం కొండలరావు తెలిపారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్‌లోని నారాయణ స్కూల్లో గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయ సైనిక్ స్కూలుకు నారాయణ విద్యార్థి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సైనిక్ ప్రవేశ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారని, విజయ పరంపరను కొనసాగించారన్నారు. ఈ సందర్భంగావిద్యార్థిని సోహినిని నారాయణ కాలేజీ కోర్ డీన్ ఏఎస్ ఆర్ రావు, ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, ఆర్ఐ వసంత్, ప్రిన్సిపాల్ సాహిద్ భాష, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థిక సాయం చేసి ఆదుకోండి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దయగల దాతలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తిరుపతి నగర పరిధి సప్తగిరి నగర్‌కు చెందిన బాధితురాలు నిర్మల వేడుకున్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనకు భర్త లేరని, ఉన్న ఒక కొడుకును ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ పోషించుకుంటున్నానని తెలిపారు. అయితే తనకు గర్భసంచిలో మొదలైన ఆరోగ్య సమస్య క్రమేపి పెరిగిపోవడంతో ఇప్పటివరకు వివిధ అవయాలకు సంబంధించి ఏడు ఆపరేషన్లు చేశారన్నారు. ప్రస్తుతం మళ్లీ ఇంకో శస్త్ర చికిత్సను చేసుకుంటే గానీ పూర్తిగా ఆరోగ్యంగా ఉండలేవని వైద్యులు సూచించారన్నారు. ఆరోగ్యశ్రీలో చేసుకుందామంటే రుయా హాస్పిటల్‌లో తగిన వైద్య సదుపాయాలు లేవని, ప్రైవేట్ హాస్పిటల్లో ఈ శస్త్ర చికిత్సను చేసుకోవాలని వైద్యులు సూచించారన్నారు. అయితే ఈ ఆపరేషన్ చేయించుకోవడానికి తనకు ఆర్థిక స్థోమత లేదని, దయగల దాతలు ఆదుకుంటే ఆరోగ్యవంతురాలని అవుతానని చెప్పారు. 7816030920 తన ఫోన్ పే నెంబర్ అని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో నిర్మల కుమారుడు పాల్గొన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - రేణిగుంట: మైనారిటీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు రేణిగుంట మైనార్టీ ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా మైనార్టీ ప్రజలను కోరారు. మే 25వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారి వయోపరిమితి 21 నుండి 55 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. మైనారిటీ ధ్రువీకరణ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ కూడా కలిగి ఉండాలని తెలిపారు.అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి పట్టణ అధ్యక్షుడిగా మహబూబ్ బాష

ప్రజాశక్తి - రేణిగుంట: టిడిపి పట్టణ అధ్యక్షుడుగా మహబూబ్ బాషా ఎన్నికయ్యారు. మండల పట్టణ కమిటీ ఎన్నికలలో మహబూబ్ బాషాను పట్టణ అధ్యక్షుడిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రకటించారు. తనపై నమ్మకంతో టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా మరోసారి అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి, మహబూబ్ బాషా కృతజ్ఞతలు తెలిపారు

రేణిగుంట మండల అధ్యక్షుడిగా ముని చంద్రారెడ్డి

రేణిగుంట టిడిపి మండల అధ్యక్షుడిగా మరోసారి ముని చంద్ర రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. టీడీపీ మండల పట్టణ కమిటీ సమావేశాల్లో ముని చంద్రారెడ్డిని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడుగా నియమిస్తున్నట్లు శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల అభివృద్ధికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ముని చంద్రా రెడ్డి తెలిపారు.

మానవత్వం చాటుకున్న సెల్వరాజ్

ప్లేట్‌లెట్స్ దానం చేస్తున్న సెల్వరాజ్

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంటకు చెందిన రైల్వే డిపార్ట్మెంట్, ఏసీ మెకానిక్ సెల్వరాజ్ ఈరోజు స్విమ్స్ హాస్పిటల్‌లో బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న తొమ్మిది సంవత్సరాల సంధ్య అనే బాలికకు ఓ పాజిటివ్ ప్లేట్లెట్స్ దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డొనర్స్ క్లబ్ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ అయిన పసేలి రాజేష్ పాల్గొని సెల్వరాజ్‌ను అభినందించారు. రాజేష్ మాట్లాడుతూ క్యాన్సర్ ట్రీట్మెంట్ తీసుకుంటున్న పేషెంట్లకు బ్లడ్ తగ్గుతూ ఉంటుదని, అలాగే ప్లేట్లెట్స్ కూడా తగ్గుతూ ఉంటాయని, వాటిని భర్తీ చేయడానికి యువత ముందుకు వచ్చి రక్తదానం, ప్లేట్లెట్ దానం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ హెచ్వోడి డాక్టర్ కేవీ శ్రీధర్ బాబు, డాక్టర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ముళ్ళపూడిలో ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్): అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తిరుపతి రూరల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని ముండ్లపూడి పంచాయతీలో పలు పనులకు భూమి పూజలు చేశారు. పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీకి విచ్చేసిన ఎమ్మెల్యేకి కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పంచాయతీ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు ఇచ్చి వీటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ముండ్లపూడి పంచాయతీలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు.50లక్షల రూపాయలతో నిర్మించనున్న కల్వర్టుల పనులకు కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేశారు. వేదాంతపురం గ్రామపంచాయతీలో అండర్ డ్రైనేజ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమాలలో వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు అభినందనీయం

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర నాయకుల కిరణ్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గత వైసీపీ ప్రభుత్వం గ్రీన్ టాక్స్ విపరీతంగా పెంచి ట్రాన్స్పోర్ట్ వ్యవస్థను నాశనం చేసిందని అనేకమంది వాహనాలు విపరీతమైన టాక్స్‌లు కట్టలేక ఓనర్లు వర్కర్లుగా మారిపోయారని ఇప్పుడు టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రీన్ టాక్స్ 1500 రూపాయలకు తగ్గించడం సంతోషకరమని రాష్ట్ర టిడిపి రాష్ట్ర నాయకులు కిరణ్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు సీఎం గ్రీన్ టాక్స్‌ను 1500 రూపాయలు ఫిక్స్ చేశారన్నారు. ఈ సమావేశంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వరరాజు, రహీం, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు పట్టణంలోని స్థానిక కార్తిక్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ పుత్తూరు పట్టణ టీడీపీ కార్యవర్గ సమావేశం ఎన్నికల అధికారి, చిత్తూరు పార్లమెంటు జిల్లా అధికార ప్రతినిధి చినబాబుల అధ్యక్షత నూతన అధ్యక్షులుగా జి.జీవరత్నం నాయుడును, ప్రధానకార్యదర్శిగా ఎన్.ఎన్.ధనపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. దీనికి సభ్యులందరూ ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి, పుత్తూరు ఏఎంసీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, కౌన్సిలర్లు కేశవాచ్చారి, బసంతి, రాధా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్మయి

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, పాలచూరులో గురువారం దమ్ము బయో ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నిర్మాణానికి ఆర్డీఓ కిరణ్మయి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కొరకు గ్రామ ప్రజలు రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమ నిర్వహణకు సంబంధించిన సిబ్బంది పరిశ్రమ విధివిధానాలు, ఉత్పత్తి, ఉద్యోగ కల్పన మొదలగు విషయాలను తెలియచేశారు. పర్యావరణ బోర్డు ఈఈ రాజశేఖర్ గ్రామస్తుల అభిప్రాయం తీసుకున్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ద్వారకా నాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, వీఆర్వో మోబీ నా, సర్వేయర్ సూర్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

విలేకరులతో మాట్లాడుతున్న యాదవ నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈ ఏడాది పదవ తరగతిలో 470 మార్కులు పైగా సాధించిన యాదవ విద్యార్థిని, విద్యార్థులకు నెల్లూరు, కొండాయపాలెం, యాదవ భవన్‌లో 1వ తేదీన నెల్లూరు జిల్లా యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందచేస్తారని వైఈపిఏ గౌరవ సలహాదారులు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న యాదవ విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వర్యులు కొలుసు పార్థ సారథి యాదవ్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర యాదవ్, మాజీ మంత్రివర్యులు అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య యాదవ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గొర్ల నరసింహ యాదవ్ తదితర యాదవ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. అర్హత కలిగిన యాదవ విద్యార్థిని, విద్యార్థులు కింది ఫోన్ నెంబర్‌కు తమ మార్కుల లిస్టు కాపీని 9948606664 వాట్సాప్‌లో పంపించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

అంధకారంలో అంబేద్కర్ కాలనీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, ఎస్.బి.ఆర్ పురం గ్రామపంచాయతీ, అంబేద్కర్ కాలనీలో తుఫాన్ ప్రభావంతో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. అయితే ఉరుములు, మెరుపులతో ఈదురు గాలులు వీచడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మండలంలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరింపబడినా, అంబేద్కర్ కాలనీకి మాత్రం కరెంట్ ఇంతవరకు రాలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చీకటిలో దోమల బెడద, విషపు క్రిమి కీటకాలు కుడతాయని వారు భయానికి గురవుతున్నారు. కాలనీవాసులు విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమస్య తెలియపరిచారు. అయితే సంబంధిత అధికారులు గురువారం వచ్చి పునరుద్ధరిస్తామని, కనీసం సత్వర చర్యలు చేపట్టలేదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేశారు.

పిల్లలను తల్లిదండ్రులే సన్మార్గంలో నడిపించాలి

తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రగతి సంస్థ సభ్యులు

ప్రజాశక్తి -ఏర్పేడు : తల్లిదండ్రులు వారి పిల్లల ప్రత్యేక అవసరాలను అర్థం చేసుకోవడానికి, వారికి సహాయపడే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో చెన్నంపల్లిలో నిర్వహించిన పేరెంట్స్ మ్యాడ్యూల్ స్పెషల్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి మండల కోఆర్డినేటర్ సుభాష్ చంద్రయ్య పిల్లలను ఉద్దేశించి, తల్లిదండ్రులతో మాట్లాడుతూ తల్లిదండ్రులే మొదటి గురువులని, తల్లిదండ్రుల ప్రవర్తనే పిల్లలపై పడుతుందని, వారిని సన్మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్వాడి టీచర్ సరస్వతి, ప్రగతి కార్యకర్త సుమలతలు తగు సూచనలను తల్లిదండ్రులకు వివరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : విద్యుత్ స్తంభాల మరమ్మత్తులు, భారీ చెట్లు నరికివేత తదితర కారణాలవల్ల నేడు నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి అర్బన్ డివిజన్ వెన్నుకోటి చంద్రశేఖర రావు తెలిపారు. 11కెవి బాలాజీ కాలనీ, ప్రకాశం రోడ్డు ఫీడర్ పరిధిలోని బాలాజీ కాలనీ, ఇందిరానగర్, కుమ్మరితోపు, ప్రకాశం రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అంతరాయాన్ని గమనించి సహకరించాలని వినియోగదారులను కోరారు.

పరశురామేశ్వరుడి సేవలో ఎయిర్‌పోర్టు డిఐజి


ఆలయంలో తమిళనాడు సౌత్ జోన్ ఎయిర్‌పోర్ట్ డిఐజి పొన్ని దంపతులు

ప్రజాశక్తి -ఏర్పేడు : గుడిమల్లం పరశురామేశ్వర స్వామి దర్శనానికి తమిళనాడుకు చెందిన సౌత్ జోన్ ఎయిర్పోర్ట్ డిఐజి పొన్ని దంపతులు విచ్చేశారు. వీరికి ఆలయ మాజీ ఛైర్మన్ బత్తల గిరినాయుడు, కార్యనిర్వాహధికారి రామచంద్రారెడ్డి స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి వేద పండితులచే ఆశీర్వచనం చేయించారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న విశ్వం విద్యా సంస్థల అధినేతలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏప్రిల్ 5న జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.యన్.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ 9వ తరగతి విభాగంలో 400 మార్కులకు 370 మార్కులతో వి.మోక్షిత్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారని, 6వ తరగతి 300 మార్కులకు 281 మార్కులతో హృతిక్ రాయల్, 275 మార్కులతో వి.నిహార్, 270 మార్కులతో సోహినిలు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. వీరితో పాటు రసజ్ఞ, జీవన్ సాయి రెడ్డి, ఆర్యన్ రెడ్డి, భువనేష్, లోహిత్, మహిదర్, అశ్విన్ తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులతో అత్యుత్తమ మార్కులు సాధించడంతో పాటు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు సాధించారని తెలిపారు.

టిడిపి మండల అధ్యక్షుడుకి సన్మానం

టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండల నూతన టిడిపి మండల అధ్యక్షుడుగా ఎన్నికైన పేరం నాగరాజు నాయుడికి పలువురు టిడిపి కార్యకర్తలు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇసుక టిప్పర్ బోల్తా.. ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అలిపిరి, కపిల తీర్థం రోడ్డు, బాలాజీ లింక్ బస్టాండ్ సమీపంలో అలిపిరి వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్ నడిరోడ్డుపై బోల్తా కొట్టింది. దీంతో అటుగా వెళుతున్న వాహనాలు ఆగిపోయి, ట్రాఫిక్ జామ్ అయింది. అదే మార్గంలో తిరుమలకు వెళ్లే బస్సులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ముందు వెళుతున్న కారు స్పీడ్ బ్రేకర్ వద్ద ఉన్నట్లు ఉండి ఆగడంతో, కారును తప్పించబోయి టిప్పర్ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు రెండు క్రేన్ల సహాయంతో టిప్పర్‌ను తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

స్కూటర్, కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, సీతారాంపేట ఫ్లై ఓవర్ మలుపు వద్ద స్కూటర్ను కారు ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు తిరుపతి నుండి శ్రీకాళహస్తికి వెళుతున్న కారు, ఏర్పేడు నుండి రేణిగుంట వైపు స్కూటర్లో వెళుతున్న ఇద్దరిని ఢీకొనడంతో స్కూటర్ నడుపుతున్న వ్యక్తికి కుడికాలు మోకాలు తొలగిపోయి తీవ్రంగా గాయపడడం జరిగింది. నూతనంగా నిర్మించిన రోడ్డుకిరువైపులా సూచిక బోర్డులను మెగా సంస్థ ఏర్పాటు చేయకపోవడతో తమ ప్రాంతంలో ఇటువంటి ఘటనలు పదేపదే జరుగుతుంటాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యువకులు క్రీడలపై ఆసక్తి చూపాలి

రెజ్లింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సన్మానం

ప్రజాశక్తి - నాయుడుపేట: చిత్తూరులో జరిగిన రెజ్లింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయుడుపేట రెంజ్లింగ్ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. పనబాక భూలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో ఆరు మంది రెజ్లింగ్ క్రీడాకారుల తోపాటు కోచ్ ఉదయ్ కుమార్‌ను పనబాక గంగ బాబు గురువారం నాయుడుపేట పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈనెల 17,18 తేదీల్లో చిత్తూరులో జరిగిన అండర్ 17 జాతీయ రెజ్లింగ్ పోటీల్లో పనబాక సంతోష్, గుమ్మడిపూడి గ్రీష్మంత్, కాగితాల ముత్యాలయ్య, మేర్లపాక చరణ్, ఒంగోలు హజరతయ్య, తొప్పాని రోహిత్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన విషయం తెలిసిందే. కాగా ఆ క్రీడాకారులు ఈనెల 25, 26, 27 తేదీల్లో చండీఘర్‌లో జరుగనున్న అండర్ 17 జాతీయ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న వారిని గంగ బాబు సన్మానించారు. అలాగే రైలు ప్రయాణంలో వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించారు.

జాపాలి హనుమాన్‌కు టీటీడీ ఛైర్మన్ పట్టు వస్త్రాలు సమర్పణ

పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న టిటిడి ఛైర్మన్ బిర్ నాయుడు

ప్రజాశక్తి - తిరుమల: హనుమజ్జయంతి సందర్భంగా తిరుమలలోని జాపాలి ఆంజనేయ స్వామి వారికి టీటీడీ తరుపున ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు గురువారం ఉదయం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీజీవో సురేంద్ర, ఆరోగ్యాధికారి మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుత్తివారిపల్లిలో హనుమజ్జయంతి..

రేణిగుంట మండలం, గుత్తివారిపల్లి, ఆర్.పి.అగ్రహారం, శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహుకులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో, రేణిగుంట ఎమ్మార్వో, ఎండోమెంట్ ఈవో, టిడిపి నాయకులు నరసింహ యాదవ్, మునస్వామి నాయుడు, పద్మనాభ రెడ్డి, శోభన్ బాబు, ద్వారక నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గూడూరులో..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో హనుమ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తూర్పు వీధి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, కరణాల వీధిలో, శ్రీ కోదండ రామాంజనేయ స్వామి వారి దేవస్థానంలో, శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా సామూహిక తమలపాకు సేవ కార్యక్రమం నిర్వహించారు. గూడూరు రూరల్ మండల పరిధిలోని చెన్నూరు, కొత్త తుంగపాలెం, తిప్పవరప్పాడు గ్రామాల్లో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు.

తిరుపతిలో..

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి, గోవింద రాజస్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం, గాంధీ రోడ్డులోని మఠం ఆంజనేయ స్వామి ఆలయం, ఓల్డ్ హుజూర్ ఆఫీస్ వద్ద అభయ ఆంజనేయ స్వామి ఆలయం, అలిపిరి శ్రీపాదాల మండపం వద్ద ఉన్న శ్రీ భక్త ఆంజనేయ స్వామివారి ఆలయం, శ్రీ కపిలేశ్వర స్వామి వారి ఆలయం పరిధిలో శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామి వారి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీ సంజీవరాయ స్వామి ఆలయాలలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు.

పుత్తూరులో..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, బెస్త వీధిలో భక్త ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్ సి పురంలో ..

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలోని శ్రీ శక్తి పీఠం ఆంజనేయ స్వామి దేవాలయం, నెత్తుకప్పంలోని వానర వనం, ఆంజనేయ విగ్రహం వద్ద, రాయల చెరువు కట్ట కింద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు.

రేణుకా మాత పరమేశ్వరి కొలుపు మహోత్సవానికి ఆహ్వానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలం వేపగుంట ఆదిఆంధ్రవాడలో జరుగనున్న శ్రీ రేణుక మాతా పరమేశ్వరి కొలుపు మహోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యను గ్రామస్థులు ఆహ్వానించారు.